సాక్షి
శ్రీకాకుళం
మంగళవారం । 14 । జనవరి । 2025



'సత్యవతి' కథ తెలుసా..?

బెంతొరియాలకు సంక్రాంతి ప్రత్యేకం. అందులోనూ సత్యవతి సంప్రదాయం ఇంకా ప్రత్యేకం.

- 8లో



కళలు భావితరాలకు..

నగరంపల్లిలో కళాజాత ఘనంగా జరిగింది. ప్రదర్శనలన్నీ ఆకట్టుకున్నాయి.

- 8లో

బీటెక్ పరీక్షల షెడ్యూల్ విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయం బీటెక్ పరీక్షల షెడ్యూల్ విడుదల చేసి, వర్సిటీ వెబ్‌సైట్‌లో పెట్టారు. ఈ మేరకు 1, 3 సెమిస్టర్ పరీక్షల నిర్వహణ షెడ్యూల్ ప్రకటించారు. 1వ సెమిస్టర్ ఈ నెల 29వ తేదీ నుంచి ఫిబ్రవరి 7వ తేదీ వరకు, 3వ సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 12వ తేదీ వరకు నిర్వహించనున్నారు.



సంతబొమ్మాళిలో భోగి మంటలు

భోగి తెచ్చె భోగం..

చిక్కటి చీకటిని చీల్చుకుంటూ పల్లె ఒడిలో భోగి మంట రాజుకుంది. నిరాశలు, నిస్పృహలు, నిట్టూర్పులన్నీ మంటల్లో కాలి బూడిదయ్యాయి. వీధి వీధినా విస్తరించిన భోగి మంటల వెలుగుల్లో విజయపు కాంతులను వెతుక్కున్నారు. - సంతబొమ్మాళి



శ్రీకాకుళం దూదివారి శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో గోదారంగనాదుల కల్యాణ వేడుకలు

గోదా కల్యాణ వైభోగమే..

రంగనాథుడితో గోదాదేవి కల్యాణ క్రతువు కడు వైభవంగా జరిగింది. ఊరు ఊరునా వైష్ణవాలయాల్లో పరిణయ వేడుకను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ పెళ్లితో ధనుర్మాస వ్రతాలను కూడా ముగించారు. - శ్రీకాకుళం కల్చరల్



అక్కులపేట గ్రామంలో సామూహికంగా చిన్నారులకు భోగి పండ్లు పోస్తున్న గ్రామ మహిళలు

బతుకు బంగారం కావాలని..

భోగి వేడుక సందర్భంగా పల్లెల్లో భోగి పండ్ల సంబరాలు ఘనంగా జరిగాయి. ఆమదాలవలస మండలంలోని అక్కులపేటలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా పల్లెటూరి ఇంటి సెట్టును వేసి స్థానిక మహిళలంతా పాటలతో సందడి చేశారు. సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన వేడుకలో పిల్లలకు భోగి పండ్లు పోశారు. - ఆమదాలవలస

న్యూస్‌రీల్

పండగ పూట అందని రేషన్ సరుకులు

సారవకోట: మండల కేంద్రంలో పలువురు లబ్ధిదారులకు రేషన్ సరుకులు 13వ తేదీ వచ్చినా అందలేదు. మూడు రేషన్ డిపోలు ఇక్కడుండగా ఒక్కో రేషన్ డిపో పరిధిలో ఉన్న కార్డుదారులకు మాత్రమే రేషన్ సరుకులను వాహనాల ద్వారా అందజేశారు. పండగ పూట కూడా కూటమి ప్రభుత్వం సమయానికి రేషన్ సరుకులు అందజేయలేదని పలువురు లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. దీనిపై అధికారులు స్పందించి రేషన్ సరుకులు మంజూరు చేయాలని వారు కోరుతున్నారు.

ఎయిర్‌పోర్టు ప్రతిపాదనలను ఉపసంహరించుకోవాలి



రాంపురం గ్రామంలో భోగిమంటల్లో ఎయిర్‌పోర్టు ప్రతిపాదిత పత్రాలను దగ్ధం చేస్తున్న వామపక్ష పార్టీల నాయకులు

పలాస: ఉద్దానం ప్రాంతంలో ఏర్పాటు చేయాలనుకుంటున్న ఎయిర్‌పోర్టు నిర్మాణాన్ని ఉపసంహరించుకోవాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు రాంపురం గ్రామంలో సంక్రాంతి సందర్భంగా భోగి మంటల్లో దానికి సంబంధించిన ప్రతులను దగ్ధం చేశారు. సోమవారం గంగువాడ, రాంపురం తదితర గ్రామాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్టు వ్యతిరేక పోరాట కమిటీని ఎన్నుకున్నారు. పోరాట కమిటీ నాయకులు ఎం.వాసు, సి.పి.ఐ.ఎం.ఎల్ న్యూడెమొక్రసీ రాష్ట్ర కమిటీ నాయకులు వంకల మాధవరావు, లిబరేషన్ నాయకులు మద్దిల రామారావు, సి.పి.ఎం నాయకులు ఎన్.గణపతి, గౌరకల బాలకృష్ణ, సార జగన్, స్థానిక సర్పంచి ధర్మారావు,సి.హెచ్ వేణు, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భోగి మంటల్లోకి విద్యుత్ బిల్లులు



టెక్కలిలో సీపీఎం ఆధ్వర్యంలో భోగి మంటల్లోకి విద్యుత్ బిల్లులు వేస్తున్న వినియోగదారులు

టెక్కలి: పేద, సామాన్య వర్గాలకు నడ్డి విరిచే విధంగా పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో భోగి మంటల్లోకి విద్యుత్ బిల్లులను వేసి నిరసన తెలిపారు. సీపీఎం నాయకులు ఎస్.షణ్ముఖరావు, యువజన విభాగం ప్రతినిధి యు.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు.

జిల్లా ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు



ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: తెలుగు సంస్కృతికి, సంప్రదాయాలకు ప్రతీక అయిన సంక్రాంతి పండుగ నిలుస్తుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. జిల్లా ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరి జీవితాల్లో సంక్రాంతి కొత్త కాంతులు నింపాలని ఆకాంక్షించారు.

పల్లెకు పొల్లాయి దీవెన

గ్లాసెడు బియ్యం పోస్తే చాలు.. వందేళ్లు చల్లగా బతకమని నోరారా దీవిస్తారు. ఒక్క నోటు చేతిలో పెడితే చాలు.. ఇంటిల్లిపాదీ సుఖ సంతోషాలతో వర్ధిల్లండి అంటూ మనసారా ఆశీర్వదిస్తారు. జత దుస్తులు ఇస్తే.. రానున్న ఏడు తరాలు ఐశ్వర్యవంతులు కావాలని నిండు గుండెతో ఆకాంక్షిస్తారు. పల్లె తల్లికి అనాదిగా ఈ దీవెన అందుతోంది. పండగకు ఇంటి ముంగిటకు వచ్చే ప్రతి కళాకారుడి నోట బంగారు మాట పలుకుతుంది.

ఇచ్ఛాపురం రూరల్:

పల్లెకు పొల్లాయి దీవెన అందుతోంది. పెద్ద పండుగ నాడు శ్రీమద్రమణ గోవిందాహరీ అంటూ సందడి చేసే హరిదాసులు.. భలే దొడ్డదొరండీ మా బసవన్న అంటూ గంగిరెద్దులతో విన్యాసాలు చేయించే డూడూ బసవన్నలు, అంబపలుకు జగదంబ పలుకు...కాశీ అన్నపూర్ణ పలుకు...అంటూ జంగమ దేవరలు వచ్చారు. వీరి రాకతో గ్రామాల్లో సంక్రాంతి శోభ కనిపిస్తోంది. తెల్లవారు జామున పొల్లాయిలు (ఇళ్ల ముందుకు వెళ్లి ధాన్యం, బియ్యం అడగటం) అడిగేందుకు వివిధ కళాకారులు తమ విద్యలతో ఇళ్ల ముంగిటకు వస్తారు. ఇంటిల్లిపాదీ చల్లగా ఉండాలని దీవిస్తారు.

● హరిదాసుల కీర్తన..



నుదుటన నిలువు నామాలు, తలపై కలశం, భుజాన తంబుర, చేతిలో చిడతలు, కాళ్లక గజ్జెలతో తొలిపొద్దు వేళ మన ఇంటికి వచ్చి 'రావమ్మా మహాలక్ష్మీ రావమ్మా...మా కోవెలా మా ఇల్లు కొలువై ఉండువుగాని కలువలా రాణీ రావమ్మా ముత్యాల ముగ్గుల్లో ముగ్గులో గొబ్బిళ్లు...' అని రాగయుక్తంగా రామనామ కీర్తనలు పాడుతుంటారు.

● సిద్ధేశుల పలుకు..



కాషాయ వస్త్రాలు ధరించి, ఎర్రటి వస్త్రంతో తలపాగా చుట్టుకొని, నుదుటున అడ్డంగా విభూది రేఖలతో, రెండు చేతుల్లో జేగంటలతో 'అంబ పలుకు జగదంబ పలుకు.. కాశీ అన్నపూర్ణ పలుకు..' అంటూ ఇళ్ల ముందు ప్రత్యక్షమవుతారు జంగమయ్యలు. వీరినే ఉద్దానం ప్రాంతంలో సిద్దేశులు అని పిలుస్తారు. పితృదేవతల పేరుపై వీరిచే పొగిడించే ఆనవాయితీ అనాదిగా పల్లె ప్రాంతాల్లో కనిపిస్తోంది. వీరికి దక్షిణగా ధాన్యం, బియ్యం, వస్త్రాలు, కాయగూరలు అందిస్తారు. ఇచ్చినవి తీసుకుని నోరారా దీవిస్తారు.

● మేళతాళాల వేడుక..

సంక్రాంతి వారం రోజులు ఉందనగానే మేళతాళాలతో గ్రామాల్లో సందడి చేస్తారు హరిజనులు. సంక్రాంతి నాడు కావిడిని తయారు చేసి అందులో వెదురు గంపలను ఉంచి ఇంటింటా సన్నాయి, డప్పులతో జట్టుగా సినిమా పాటలు, అమ్మవారి పాటలు పాడుతూ ధాన్యం, బియ్యంతో పాటు దుస్తులు, డబ్బులు సేకరిస్తూ కుటుంబాన్ని దీవిస్తుంటారు. అలాగే కప్ప చర్మంతో తయారు చేసిన ఢమరుకాన్ని ఒక చేత్తో మోగిస్తూ, మరో చేత్తో లాంతరు పట్టుకొని, తలపై వివిధ పక్షుల ఈకలను అలంకరించుకొని, నడుం నుంచి కాళ్ల వరకు గణగణమంటూ మోగుతూవేలాడే గంట శబ్దాలతో గంట సాయిబులు తిరుగుతారు.

● గంగిరెద్దుల సందడి



డూడూ బసవన్నల సందడి

'భలే దొడ్డదొరండీ మా బసవన్న...బాబుగారొచ్చారు, అమ్మగారొచ్చారు, లక్ష్మీపుత్రులు సింహాద్రి అప్పన్నకు ఎలా దండం పెడతావో చెప్పు' అంటూ గంగిరెద్దులతో విన్యాసాలు చేయించే డూడూ బసవన్నలు...' సంక్రాంతికి సందడి చేస్తుంటారు. ఉదయం గంగిరెద్దులను అందంగా అలంకరించి, డోలు, సన్నాయిలతో ఇళ్ల ముందుకు వస్తారు. వీరు సైతం పితృదేవతలను పొగుడుతారు.



సన్నాయి మేళంతో సందడి చేస్తున్న కళాకారులు

పరివార దేవతలకు పులగం ప్రసాద నివేదన

అరసవల్లి: ప్రత్యక్షదైవానికి మహా నివేదనగా కొత్త పంట ధాన్యం తొలి ప్రసాదమైంది. చేతికి అందివచ్చిన పంట ధాన్యంతో చేసిన పులగం ప్రసాదంగా స్వామి వారి పరివార దేవతలకు సోమవారం ఉదయం నివేదించారు. ఏటా భోగి పర్వదినం ముందురోజున ఇలా కొత్త ధాన్యం నుంచి తయారుచేసిన ప్రత్యేక వంటకాలను స్వామికి, పరివార దేవతలకు నివేదించడం ఇక్కడ వందల ఏళ్లుగా ఆచారంగా వస్తోంది. ఈ మేరకు సోమవారం వేకువజామున 3 గంటల నుంచి ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. పంచాయతన పూజలను నిర్వహించి స్వామికి విశేష మహా నివేదనను సమర్పించారు. అనంతరం మహా హారతి తర్వాత సర్వదర్శనాలకు అవకాశమిచ్చారు. అలాగే ఆదిత్య క్షేత్ర పరివారదేవతలకు అయనం పూజలను చేసి భక్తులకు ఉచితంగా ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఉత్తరాయణ మకరసంక్రమణం సందర్భంగా మంగళవారం ఉదయం ఆదిత్యునికి ప్రత్యేకంగా పంచామృతాలతో అభిషేకాలు చేయనున్నారు. క్షీరాభిషేక సేవలో భాగంగా రూ. 500 చెల్లించిన భక్తులు ఈసేవలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా స్వామి వారి మూలవిరాట్టు నిజరూప దర్శనంతో పాటు అభిషేకాదిత్యున్ని దర్శించుకునేందుకు భక్తులు తరలిరానున్నారు.



పులగం నివేదన అనంతరం భక్తులకు పంపిణీకి సిద్ధం చేస్తున్న అర్చకులు



గంగిరెద్దు విన్యాసం

బసవన్నతోనే బతుకు



నేను చిన్నప్పటి నుంచి బసవన్నతోనే ఉంటున్నాను. బసవన్న ఆడితేనే మా బతుకులు నడుస్తున్నాయి. స్వతహాగా జానపద కళాకారుడ్ని కావడంతో పండగ పూట మినహా అమ్మవారి ఉత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని ప్రదర్శనలు ఇస్తుంటాను. సంక్రాంతి వచ్చిందంటే మేమంతా వారం రోజుల పాటు ఊరూరా వెళ్లి గంగిరెద్దుల ప్రదర్శనలు ఇస్తుంటాము. - బాడ సూరన్న

బసవడే బతుకులకు బాసట

● సంక్రాంతి పూట గంగిరెద్దుల ఆట ● బసవన్న ఆడితేనే బతుకు బండి నడిచేది



గంగిరెద్దుల ప్రదర్శన

ఇచ్ఛాపురం రూరల్:

అరుణారుణ ఉదయాల్లో బసవడి సందడి కనిపిస్తేనే అసలైన పెద్ద పండగ. బసవడు ఆడితేనే గంగిరెద్దుల వారి బతుకు బండి సాగుతుంది మరి. బసవన్నంటే.. పరమశివుడి వాహనమైన నంది. సంక్రాంతి పండగ వారం రోజుల పాటు ప్రత్యేక ఆకర్షణగా గంగిరెద్దు నిలుస్తుంది. మందస మండలంలోని బైరిసారంగపురం తదితర చోట్ల ఈ కుటుంబాలు ఎక్కువగా నివాసం ఉంటాయి. ఈ కుటుంబాలకు గంగిరెద్దే పెద్ద దిక్కు.

ఊళ్లను పంచుకొని..

అందరూ ఆస్తులను పంచుకుంటే.. వీళ్లు మాత్రం ఊళ్లను పంచుకుంటారు. మందస మండలం సారంగపురంలో వంద కుటుంబాలు ఉండగా, కవిటి మండలం బెలగాం కాలనీలో పది కుటుంబాలు, పలాస మండలం నెమలి కొండ వద్ద మరో పది కుటుంబాలు, టెక్కలి మండలం పరుశురాంపురంలో 15 కుటుంబాల వరకు గంగిరెద్దుల వాళ్లు జీవనం సాగిస్తున్నారు. మగవారు సన్నాయి, డొలు, సుతితో గంగిరెద్దును ఊరూరా తిప్పుతూ ఆడిస్తే... మహిళలు వెదురు బుట్టలో కాటుక, బొట్టు బిళ్లలు, పిన్నీసులను అమ్ముతుంటారు. ఇప్పుడు చాలా వరకు చదువుకుని ఉద్యోగాలు చేసుకుంటున్న వారు కూడా ఉన్నారు.

అరుదైన కళ..

గంగిరెద్దును ఆడించడం ఓ అరుదైన కళ. ఒక ఎద్దును మచ్చిక చేసుకుని అది తమ మాటకు, పాటకు అనుగుణంగా ఉండటం, చేయడమంటే చాలా శ్రమతో కూడిన పని. గంగిరెద్దులకు ఆట నేర్పించడం అంటే అంతా ఆషామాషీ కాదంటున్నారు గంగిరెద్దుల వాళ్లు. గంగిరెద్దులకు ఆట నేర్పించడానికి తమలో ప్రత్యేక గురువులు ఉంటారని చెబుతున్నారు.

మరో పని చేతకాదు



మా తాతముత్తాతల నుంచి గంగిరెద్దును ఆడించి బతుకుతున్నాము. మా తల్లిదండ్రులు నేర్పించిన ఈ విద్య తప్ప మాకు మరో విద్య చేతకాదు. మాలా మా పిల్లలకు ఈ గతి పట్టకూడదని చదివిస్తున్నాము. మేమంతా ఈ బసవన్ననే నమ్ముకొని జీవనం సాగిస్తుంటాము. రానురాను ఈ కళ అంతరించి పోతుంది. ప్రభుత్వం మా కుటుంబాలను ఆదుకోవాలి. - బాడ భువన్‌దేవ్

జాతరో జాతర..

● సంక్రాంతి సందర్భంగా పల్లెల్లో జాతరలు ● కనుమ, ముక్కనుమ నాడు సంబరాలు

● తండ్యాలపేటలో..



ఉత్తర దిక్కున చూస్తున్నట్టు ఉండే హనుమ

గార: ఆది కూర్మక్షేత్రం శ్రీకూర్మంలోని కూర్మనాథాలయానికి ఉప ఆలయమైన తండ్యాలపేట అభయ వరద ఆంజనేయస్వామి ఆలయంలో ఏడాదికొకసారి జరిగే ప్రత్యేకమైన కనుమ ఉత్సవానికి అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ ఆలయంలో ఆంజనేయుని విగ్రహం ఉత్తరాన్ని చూస్తున్నట్టుగా మనకు దర్శనమిస్తుంటారు. ఆలయానికి చక్రతీర్థం లేదా సింధూర తీర్థమన్న పేరుతో పుష్కరిణి ఉంది. ఇక్కడి నీరు లేత సింధూరంలో నీరు ఉంటుంది. కనుమ రోజున బుధవారం సాయంత్రం 4 గంటల తర్వాత కూర్మనాథాలయం నుంచి లవకుశలు సమర్పించినట్టుగా చెబుతున్న శ్రీసీతారామ లక్ష్మణ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి ప్రత్యేక పూజలు చేసి మళ్లీ తిరిగి కూర్మనాథాలయానికి చేరుస్తారు. ఉత్సవానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ ఈఓ జి. గురునాథరావు, అర్చకులు గోపి నంబాళ్ల కూర్మరాజాచార్యులు తెలిపారు.



కొండపై ఉన్న సంగమేశ్వర ఆలయం

ఆమదాలవలస: ఆమదాలవలస పట్టణానికి మూడు కిలోమీటర్ల దూరంలోని కొండల మధ్య అతిపెద్ద కొండపై సంగమేశ్వర ఆలయం నెలకొని ఉంది. ఈ కొండ చరిత్ర 12వ శతాబ్దానిదని 1982లో సర్వే చేసిన పురావస్తుశాఖ ప్రతినిధి జవహర్‌లాల్ పేర్కొన్నారు. జైన మతస్తులు తరువాత బౌద్ధ మతస్తులు ఆ తరువాత శైవ మతస్తులు ఈ

● సంగమయ్య జాతర చూద్దామా..

కొండను ఆశ్రయించి తమ మతాలను మరింత ప్రభావితం చేశారని చరిత్రకారులు చెబుతుంటారు. పూర్వ రాజుల ఔన్నత్యానికి ఒక సజీవ సాక్షిగా ఈ కొండ దర్శనమిస్తుంది.

ఏటా రాష్ట్రంలో జరిగే తొలి జాతర ఈ కొండ దిగువ ప్రాంతంలో జరుగుతుంది. సంక్రాంతి మొదలు కొని కనుమ, ముక్కనుమ రోజుల్లో మూడు రోజుల పాటు ఎంతో భారీగా జాతర జరగనుంది.

మొదటి జాతర అయినందున జిల్లా నుంచే కాక ఇతర జిల్లాలు, పక్క ఒడిశా రాష్ట్రం నుంచి చాలా మంది యాత్రికులు వస్తుంటారు. ఈ జాతరకు సుమారు 2 లక్షల మంది హాజరవుతారు. సంగమేశ్వర కొండ పైభాగంలో ఉన్న ఆలయం ఎడమ పక్కన ఓ బావి ఉంటుంది. ఈ బావిలో దేవాలయంకు వచ్చే ప్రతీ భక్తుడు కూడా చిల్లర డబ్బులు వేసి తమ మొక్కులు తీర్చుకుంటారు. చిల్లర నాణేలు వేయడం ద్వారా కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం.

● పద్మనాభ కొండపై..

జలుమూరు: ప్రసిద్ధ శైవ క్షేత్రం శ్రీముఖలింగం క్షేత్ర పాలకుడు శ్రీమహావిష్ణువు జాతర కనుమ నాడు శ్రీముఖలింగం-కరకవలస గ్రామాల మధ్యన ఉన్న పద్మనాభ కొండపై జరగనుంది. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకూ జరిగే ఈ ఉత్సవాలకు చుట్టుపక్కల గ్రామాలతోపాటు అటు హిరమండలం, జలుమూరు, ఎల్ఎన్‌పేట నుంచి పెద్ద ఎత్తున జనాలు వస్తారు. అలాగే ముక్కనుమ సందర్భంగా రాణలో వెలిసిన ముఖలింగేశ్వరుని తిరువీధి ఉత్సవం ఘనంగా జరగనుంది. గ్రామానికి పశ్చిమవైపు ఉన్న ఆలయం నుంచి పార్వతీపరమేశ్వరులను జాతర స్థలం వద్దకు తీసుకువస్తారు.



పూజలందుకుంటున్న ముఖలింగేశ్వరుడు

● జాతర చేద్దాం..



గెడ్డకంచరాంలో వెలసిన పైడితల్లమ్మ వారి విగ్రహం

జి.సిగడాం: మండలం పరిధిలోని మెట్టవలస ఏకశిలా పర్వతంపై వెలసి ఉన్న మల్లికార్జునస్వామి యాత్ర మహోత్సవాలకు అంతా సిద్ధమైంది. యాత్ర మహోత్సవాలు మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లను గ్రామ పెద్దలు ఏర్పాటు చేశారు. గెడ్డకంచరాం గ్రామంలో ఈ నెల15 తేదీ నుంచి పైడితల్లమ్మ వారి యాత్ర మహోత్సవాలు జరగనున్నాయి.

ఏటా కనుమ రోజున ఈ ఉత్సవాలు ప్రారంభించి మూడు రోజులుపాటు నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. సుదూరు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక వసతులు ఏర్పాటు చేశామని తెలిపారు.

క్లుప్తంగా

ముగిసిన శ్రీమహావిష్ణువు పూజలు



శ్రీమహావిష్ణువుకు పూజలు చేస్తున్న అర్చకులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగేశ్వరుని క్షేత్రపాలకుడు శ్రీమహావిష్ణువు ధనుర్మాసం ముగిసిన నేపథ్యంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తులసీ దళపూజ, అభిషేకాలు, అర్చనలు, సహస్రనామ పారాయణాలు నిర్వహించి హారతులు ఇచ్చారు. నెల రోజులు పాటు నిర్వహించిన ఈ పూజలు భోగితో సమాప్తం చేశారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. పండగ సందర్భంగా చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చారు.

శ్రీముఖలింగేశ్వరుని సేవలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి



న్యాయమూర్తి దంపతులకు దీవిస్తోన్న అర్చకులు

జలుమూరు: శ్రీముఖలింగంలో వెలిసిన మధుకేశ్వరుని సోమవారం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి అనుపమ చక్రవర్తి దంపతులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారాహి అమ్మవారికి కుంకుమ పూజలు చేసి అర్చకులు గోలెం చరిత్ర, స్వామివారి కథ వివరించి తీర్థ ప్రసాదాలు అందించి పుణ్యాహావచనాలతో దీవించారు.

సత్యవతి కథ తెలుసా..?

కవిటి/ఇచ్ఛాపురం రూరల్: జిల్లాలోని బెంతొరియాలు మకర సంక్రాంతికి ప్రత్యేక సంప్రదాయాలు పాటిస్తారు. ఆ రోజు తమ కుల దైవంగా పిలిచే సత్యవతి(సాత్తోరి)ని మేళతాళాలు, మంగళ వాయిద్యాలు నడుమ ఊరేగించి ఉత్సవాన్ని జరుపుకుంటుంటారు. సంక్రాంతి సత్యవతి కథ తెలియాలంటే బెంతొరియా గ్రామాలకు వెళ్లాల్సిందే. స్థానికులు చెప్పుకునే కథనం ప్రకారం..

ఎన్నో శతాబ్దాల క్రితం కవిటి మండలం రాజపురం గ్రామానికి చెందిన బెంతోరియా యువతిని బొరివంక గ్రామానికి చెందిన యువకుడికి ఇచ్చి వివాహం జరిపించారట. గురువారం రోజు పెళ్లి కూతురుకు అప్పగింతలు జరిగాయి. ఆ సమయంలో నూతన వధువు వెంట వరుడు ఇంటికి 'పసుపు' ముద్దను కూడా పంపించారు. కొత్త కాపురంలో కొద్ది రోజుల్లోనే కలతలు చెలరేగాయి. ఈ ఘటన రెండు గ్రామాల మధ్య ఏళ్ల తరబడి మనశ్శాంతి లేకుండా చేసిందంట. అదే సమయంలో ఇరు గ్రామాల పెద్ద 'దొళాయి' కలలో ఓ కన్య కనిపించి 'పేరంటాలు సత్యవతి'గా పరిచయం చేసుకుంది. వధువు తెచ్చిన 'పసుపు ముద్ద' ద్వారా తాను రాజపురం నుంచి బొరివంక చేరుకున్నానని, మకర సంక్రాంతి రోజున తనకు ఇరు గ్రామాల వారు పూజలు చేస్తే అంతా మంచే జరుగుతుందని చెప్పడంతో మరుసటి రోజు ఇరు గ్రామాల ప్రజలు ఒక దగ్గర కూర్చొని మకర సంక్రాంతి రోజున ఇరు గ్రామాల్లో ఒకే రోజు ఈ ఉత్సవం నిర్వహించేందుకు పూనుకున్నారు. ఆ రోజు నుంచి తరతరాలుగా వస్తున్న సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు.

మకర సంకాంతి రోజున వృద్ధురాలి శరీరానికి పసుపు పూత పూసి పేరంటాలుగా తయారు చేస్తారు. కుల పెద్ద దొళాయి వారి ఇంటి నుంచి పేరంటాలను మేళతాళాలు మధ్య ఊరేగింపుగా పొలిమేర వరకు తీసుకువెళ్తారు.

అక్కడే పేరంటాలను పూల పందిరిలో ఉంచి పూజలు చేస్తారు. ఈ సందర్భంగా సత్యవతి పేరంటాల కోసం కొనుగోలు చేసిన నూతన వస్త్రాలను ప్రతి బెంతొరియాకు చెందిన కుటుంబాలు అలంకరిస్తాయి.



మేళతాళాల నడుమ పేరంటాలు సత్యవతిని ఊరేగిస్తున్న బెంతొరియా సామాజిక వర్గం

● నేస్తానికి ఓ గుమ్మడికాయ



సంక్రాంతి రోజుల్లో గిరిజన ప్రాంతాల్లో అరుదైన సంప్రదాయాలు కనిపిస్తాయి. సంక్రాంతి పండగ నాడు గిరిజన సంప్రదాయం ప్రకారం నేస్తం ఇంటికి వెళతారు. భోగి పండగ రోజు ఉదయం నేస్తం ఇంటికి చేరుకుని సాయంత్రం వరకు అక్కడే ఉంటారు. అలా వెళ్లినప్పుడు ఇలా గుమ్మడికాయ, పెండలం కూర, అరటి కాయలు, అరటి పళ్లు, కంది కాయలు తీసుకెళ్తారు.

– ఎల్‌ఎన్‌పేట

జనం గుండెలో జగన్ పాలన పదిలం



గత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల ముగ్గు

కాశీబుగ్గ: గత ప్రభుత్వ హయాంలో అమలు చేసిన పథకాలు జనం గుండెదాటి పోలేదు. సంక్రాంతి సందర్భంగా పలాసలో మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సతీమణి సీదిరి శ్రీదేవి వేసిన సంక్రాంతి ముగ్గు ఇది. ఇప్పుడు కూటమి పాలనలో అమలవుతున్న పథకాలకు సంబంధించి కూటమి నేతలకు చెందిన కుటుంబ సభ్యులు వేయబోయే సంక్రాంతి ముగ్గు ఎలా ఉంటుందో అని రాష్ట్ర ప్రజలంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని క్యాప్షన్ పెట్టారు.

ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

టెక్కలి రూరల్: పండగ పూట ఓ కుటుంబంలో విషాదం అలముకుంది. రెండు రోజుల కిందట విశాఖ పట్నం నుంచి తన సొంత గ్రామమైన పెద్ద సాన గ్రామం వచ్చి తన కుటుంబ సభ్యులతో సంతోషంగా గడిపి తిరిగి తన భార్య, పిల్లలు దగ్గరకు వెళ్తుండగా మృత్యువు ఓ బస్సు రూపంలో వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. పెద్ద సాన గ్రామం హరిజన వీధికి చెందిన గందావు అప్పారావు(54) అనే వ్యక్తి గత కొంత కాలంగా విశాఖపట్నంలో భార్య గీత, కుమారుడు శివసాయితో కలసి కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. ప్రతి పండుగ సందర్భంగా అప్పారావు తన సొంత గ్రామానికి వచ్చి భోగి రాత్రి మళ్లీ వెళ్లిపోతాడు. ఈ క్రమంలోనే రెండు రోజుల కిందట విశాఖపట్నం నుంచి పెద్దసాన వచ్చి తిరిగి సోమవారం రాత్రి విశాఖపట్నం వెళ్లేందుకు కె.కొత్తూరు సమీపంలో జాతీయ రహదారి మధ్యలో గల డివైడర్‌ను దాటుతుండగా.. భువనేశ్వర్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ప్రైవేటు బస్సు ఢీకొట్టింది. ప్రమాదంలో అప్పారావు తలకు తీవ్రగాయాలు కావడంతో హుటాహుటిన హైవే అంబులెన్స్‌లో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పారావు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న సీఐ విజయ్‌కుమార్ వివరాలు సేకరించి కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు.



ప్రైవేట్ బస్సు ఢీకొనడంతో మృతి చెందిన అప్పారావు

డెంటల్ విద్యార్థిని అదృశ్యం

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని పాత్రునివలసలో గల శ్రీసాయి డెంటల్ కళాశాలకు చెందిన విద్యార్థిని ప్రగడ తులసి జ్యోతిర్మయి సంక్రాంతి సెలవులకు వెళ్తూ ఇంటికి రాలేదని విద్యార్థిని తండ్రి ప్రగడ రాజు సోమవారం శ్రీకాకుళం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమె బీడీఎస్ తృతీయ సంవత్సరం చదువుతోంది. విజయనగరం జిల్లా బొబ్బిలిలోని సనపతి వీధి ఆమె స్వస్థలం. ఈ నెల 11న కళాశాలకు సంక్రాంతి సెలవులు ఇవ్వడంతో ఇంటికి వెళ్తానని చెప్పి బయలు దేరినట్లు తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మృతుడు కృష్ణారావు (ఫైల్)

పాతపట్నం: పాతపట్నం మేజర్ పంచాయతీ ఉప్పరవీధికి చెందిన రవ్వ కృష్ణారావు (57) శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్ఐ బి.లావణ్య తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణారావు ఆదివారం పెట్రోల్ పోసుకుని నిప్పు అంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గ్రామస్తులు గమనించి స్థానిక సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అక్కడి నుంచి వైద్యులు శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు. భార్య రోజా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు చెప్పారు. కేసులో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కోడి పందేలపై కేసు నమోదు

జలుమూరు: మండల పరిధి అంధవరంతోపాటు గంగన్నపేట–మాకివలస, పర్లాం తోటలో కోడిపందాలు ఆడుతున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు నరసన్నపేట సీఐ కె.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. వీరి వద్ద నుంచి మూడు కోడిపుంజులు స్వాధీనం చేసుకున్నారు. వీరిని విడిచిపెట్టాలని పోలీసులపై ఒత్తిళ్లు రావడం గమనార్హం.

ఆక్సిజన్ లేక అవస్థలు

వజ్రపుకొత్తూరు: వజ్రపుకొత్తూరు మండలం అనంతగిరి పంచాయతీ పరిధిలో ఉన్న వెంకటాపురం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆక్సిజన్ సిలిండర్ పనిచేయక అవస్థలు పడుతున్నారు. ఇదే గ్రామానికి చెందిన ఓ కిడ్నీ బాధితురాలు సోమవారం వేకువజామున ఆయాసంతో ఆరోగ్య కేంద్రానికి చేరుకుంది. అత్యవసరంగా ఆక్సిజన్ అవసరం పడటంతో ఆస్పత్రిలో ఉన్న ఆక్సిజన్ మిషన్ పెట్టారు. మిషన్ పనిచేయక పేషెంట్ ప్రాణాపాయ స్థితికి చేరుకుంది. ఇదే విషయం వైద్యాధికారిని ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు. ఇకనైనా ఆరోగ్య కేంద్రంలో ఉన్న ఆక్సిజన్ సిలిండర్ ఏర్పాటు చేసి మిషన్‌ను మరమ్మతు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



పనిచేయని ఆక్సిజన్ మిషన్, విలవిలలాడుతున్న కిడ్నీ బాధితురాలు



ఇరువర్గాల మధ్య కొట్లాట

టెక్కలి రూరల్: మండలంలోని తిర్లంగి గ్రామంలో సోమవారం ఇరువర్గాల మధ్య కొట్లాట కారణంగా పలువురిపై కేసు నమోదు చేసినట్లు టెక్కలి పోలీసులు తెలిపారు. ఈ మేరకు స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఆదివారం తిర్లంగి గ్రామానికి చెందిన జలుమూరు చిట్టిబాబు తన కారులో వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన సనపల విశ్వనాథం తన ద్విచక్రవాహనంపై ఎదురెదురుగా వస్తుండగా రెండు వాహనాలు ఢీకొనడంతో చిన్నపాటి తగాదా చోటు చేసుకుంది. అనంతరం మరుసటి రోజు ఉదయం ఇరు వర్గాల వారు కర్రలతో దాడిచేసుకున్నారు.దీంతో ఇద్దరికీగాయాలు కావడంతో టెక్కలి జిల్లా ఆస్పత్రిలో చేర్పించారు. ఇరువర్గాల వారు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు.

8న శాలిహుండం గిరి యాత్ర

గార: శాలిహుండం కొండపైనున్న కాళీయమర్ధన వేణుగోపాలస్వామి యాత్ర వచ్చేనెల 8న భీష్మ ఏకాదశి పర్వదినాన జరుగుతుంది. ఈ సందర్భంగా యాత్ర బ్రోచర్‌ను సోమవారం ఉదయం ఆలయంలో స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 7వ తేదీన ప్రారంభమైన ఈ ఉత్సవాలను 12వ తేదీ కల్యాణోత్సవంతో ముగిస్తామన్నారు. ఆలయ అభివృద్ధి కోసం నివేదిక తయారుచేసి, తిరుమల తిరుపతి దేవస్థానాల నిధులతో ఆలయ అభివృద్ధికి చర్యలు కృషి చేస్తామన్నారు.



శాలిహుండం యాత్ర బ్రోచర్ విడుదల చేస్తున్న దృశ్యం

132 క్వార్టర్ బాటిళ్లతో వ్యక్తి అరెస్టు



స్వాధీనం చేసుకున్న 132 క్వార్టర్ బాటిళ్లు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి కేటీ రోడ్డులో 132 క్వార్టర్‌లను ద్విచక్రవాహనంపై తరలిస్తున్న వ్యక్తిని కాశీబుగ్గ పోలీసులు పట్టుకుని అరెస్టు చేశారు. అనంతరం అతని వద్ద ద్విచక్ర వాహనాన్ని, మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఉదయపురానికి చెందిన పాండవ వెంకటరమణ పలాస నుంచి ఉదయపురం తరలిస్తుండగా జరిపిన తనిఖీల్లో పట్టుబడగా కేసు నమోదు చేశామని కాశీబుగ్గ సీఐ సూర్యనారాయణ తెలిపారు.

ప్రయాణికుల ఇక్కట్లు



కోసంగిపురం హైవే పై ప్రయాణికులకు విడిచిపెడుతున్న ఓ సర్వీస్, మరో ప్రైవేటు బస్సుకు మారుతున్న ప్రయాణికులు




కాశీబుగ్గ బస్టాండ్‌లో ఆర్టీసీ బస్‌ల కోసం ఎదురుచూపులు



కాశీబుగ్గ బస్టాండ్‌లో ప్రైవేటు బస్సుల చుట్టూ ప్రయాణికులు

కాశీబుగ్గ: సుదూర ప్రాంతాల నుంచి వేల రూపాయలతో కొనుక్కున్న టిక్కెట్‌తో ప్రయాణించి చివరకు రోడ్డు పాలవుతున్నారు. మహిళలు, యువతులు కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడంతో తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం వంటి సుదూరు ప్రాంతాల నుంచి వచ్చే ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు జాతీయ రహదారిపై కూడలి వద్ద ప్రయాణికులను విడిచిపెట్టి వెళ్లిపోతున్నాయి. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో ప్రయాణికులకు సరైన బస్సులు లేకపోవడంతో ప్రైవేటు వాహనాలపై ఆధారపడి ప్రయాణాలు సాగిస్తున్నారు. ఆర్టీసీని నమ్ముకున్న వారు గంటల తరబడి వేసి ఉండి ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు తిరుగు ప్రయాణంలో ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.



కళలు భావితరాలకు అందిద్దాం

వజ్రపుకొత్తూరు రూరల్:

మరుగున పడిన జానపద కళలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపైన ఉందని అంబేడ్కర్ యూనివర్సిటీ పూర్వపు ఉపకులపతి హనుమంతు లజపతిరాయ్, గిడుగు రామ్మూర్తి జానపద కళాపీఠం వ్యవస్థాపకులు బద్రి కూర్మారావు అన్నారు. మండలంలో గల నగరంపల్లిలో ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో సోమవారం జానపద కళాజాత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నేడు డిజిటల్ యుగంలో అంతరించిపోతున్న జానపద కళలకు జీవం పోయాల్సిన అవసరం ఉందన్నారు. కళలు జాతిని జాగృతం చేస్తాయని, చైతన్యం కలిగించడంతో పాటు మానసిక ఆనందాన్ని కలిగిస్తాయని అన్నారు. ఉత్తరాంధ్ర యాస, భాష, పాట, ఆటను విస్తృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కళాకారులు ఆట పాటలో హోరెత్తించారు. పలు ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అలాగే కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు దువ్వాడ మధుకేశ్వరరావు, పార్టీ నాయకులు బమ్మిడి మోహన్‌రావు, దువ్వాడ జయరాం చౌదరి, బమ్మిడి ఆనందరావు, నెయ్యిల మోహన్‌రావు, శిష్టి మనోజ్, వైకురంతరావు, చంద్రయ్య, కుమార్ నాయక్, బోనేల గోపాల్, నాయకులు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



అసిరయ్యను అభినందిస్తున్న లజపతిరాయ్



రుణం.. దారుణం

- సామాన్యులు రుణం పొందడం ఇక కష్టమే
- ప్రామిసరీ నోట్లకు చెల్లుచీటీ
- కొత్తగా అనియంత్రిత రుణ నిషేధ చట్టం

శ్రీకాకుళం పాతబస్టాండ్: కేంద్రం రోజుకో చట్టాన్ని తీసుకువస్తోంది. ఇప్పటికే మూడు పాత చట్టాల స్థానంలో కొత్త చట్టాలను తీసుకు వచ్చింది. తాజాగా అనియంత్రిత రుణ నిషేధ చట్టంపై కూడా ప్రతిపాదనలు తీసుకువచ్చింది. ఈ బిల్లును చట్టం సభ ద్వారా ఆమోదింపజేయడం, అమలు జేయడం ఇంకా మిగిలి ఉంది. దీనిపై సీనియర్ న్యాయవాది ఆగూరి ఉమామహేశ్వరరావు వివరించారు. ఈ చట్టం వల్ల లాభం కంటే ఎక్కువగా ప్రజలకు నష్టం ఉంటుందని తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు..

అనియంత్రిత రుణ కార్యక్రమాల చట్టం అమలులోకి వస్తే, పేదలకు, మధ్య తరగతి వ్యక్తులకు అవసరాలకు రుణం పొందడం మృగ్యంగా మారనుంది. ఇప్పటి వరకు ప్రామిసరీ నోటు, బ్యాంకు చెక్కుల ద్వారా బంధువులు, ఇతర వ్యక్తుల నుంచి రుణం పొందుతున్నవారు, ఇక నుంచి ఆ అవకాశాన్ని కోల్పోతారు. కొత్తగా రానున్న చట్టం ద్వారా ప్రైవేటు వ్యక్తులకు ప్రామిసరీ నోట్లు, చెక్కుబౌన్సుల కేసులకు న్యాయస్థానం ద్వారా రక్షణ ఉండదు. కేసు వేసే అవకాశం లేకుండా ఈ చట్టం నియంత్రిస్తుంది. దీంతో ప్రైవేటు ఆర్థిక లావాదేవీలకు రక్షణ ఉండదు. కేవలం ప్రైవేటు ఆర్థిక కార్యకలాపాలను నియంత్రించాలనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దీని వల్ల చిన్నచిన్న వడ్డీ వ్యాపారాలు చేసుకుంటున్న వారికి కష్టమవుతుంది.

అనియంత్రిక రుణ కార్యక్రమాల నిషేధ చట్టం ప్రకారం రుణం పొందాలంటే బ్యాంకులు, రిజిస్టర్డ్ సంస్థల నుంచి రక్త సంబంధీకులైన బంధువులు నుంచి మాత్రమే రుణం పొందగలరు. మరే ఇతర వ్యక్తులు, ప్రైవేటు వ్యక్తుల నుంచి రుణం తీసుకోవడం సాధ్యం కాదు. దీని ప్రకారం పూర్తిగా రుణ కార్యక్రమాలు పారదర్శకంగా, న్యాయబద్ధంగా ఉంటాయని ప్రభుత్వం ఆలోచన.

చట్టం ఇలా..

ఈ చట్టం ప్రకారం రుణ కార్యక్రమాలు అనేవి ఏదైనా ఒక చట్టబద్ధమైన సంస్థ మాత్రమే చేయాలి. రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా, ఇతర నియంత్రణ సంస్థలు, అనుమతించిన సంస్థలు వ్యక్తుల ద్వారా మాత్రమే రుణం పొందగలుగుతారు. ఈ చట్టాన్ని అతిక్రమించి రుణాలు అందిస్తే చర్యలు తీసుకుంటారు. రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా చట్టం 1934. సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డు ఆఫ్ ఇండియా చట్టం 1992, మల్టీ సేట్ కోపరేటివ్ సొసైటీల చట్టం 2002 వంటి మూడు చట్టాలను సవరించడానికి కూడా కేంద్రం ప్రయత్నాలు చేస్తోందని న్యాయవాది ఆగూరి ఉమామహేశ్వరరావు తెలిపారు.